క్లుప్తంగా

దాతృత్వం చాటిన స్నేహితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన గుల్లపల్లి శేఖర్ అనే వ్యక్తికి రెండు కిడ్నీలు పాడై కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న తనతో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం శేఖర్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తలా కొంత జమ చేసుకున్న మొత్తం డబ్బులు రూ.75వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. చిన్ననాటి స్నేహితుడికి చేయూతను అందించడంతో గ్రామస్తులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పి.టివెంకటాపూర్ ఉపసర్పంచ్ వెంకట్‌గౌడ్, శ్రీధర్, రమేశ్, వెంకటేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలి సమాజం అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

దుబ్బాకటౌన్: పద్మశాలి సమాజం అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నగాజుల తిరుపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆస యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు పల్లె వంశీకృష్ణగౌడ్, ఎంగారి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు బానాల శ్రీనివాస్, ఇస్తారిగల్ల చరణ్‌తేజ తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): పేదలకు మెరుగైన కంటి వైద్యం అందించడానికే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రామునిపట్లలో గ్రామసభ నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని అన్ని రంగాల వారు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ బాటలో యువత పయనించాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో శనివారం కమ్యూనిస్టు యోధుడు, సోవియట్ యూనియన్ వ్యవస్థాపక అధినేత వ్లాదిమిర్ లెనిన్ 99వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని అక్రమాలను అరికట్టేందుకు లెనిన్ ఆశయబాటలో నేటి యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అయిలేని సంజీవరెడ్డి, మల్లారెడ్డి, అక్బర్, ఏలూరి స్వాతి, సాయిప్రసాద్‌రెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కామ్రేడ్ లెనిన్ నేటి యువతరానికి ఆదర్శం అని ఎస్ఎఫ్ఐ జిల్లా క్యాదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జలిగాపు శిరీష , రెడ్డమైన అరవింద్, కొండం సంజీవ్, నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు మతిన్ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో చేపడుతున్న అల్పాహార పంపిణీ కార్యక్రమం శనివారం 200వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, కొండపోచమ్మ దేవస్థాన కమిటీ డైరెక్టర్ సంతోష్‌కుమార్, లయన్స్ క్లబ్ ఎన్విరాన్మెంట్ చైర్మన్ పరమేశ్వరచారి, లయన్స్ క్లబ్ సభ్యులు సంజయ్‌గుప్తా, ఎల్లంరాజ్, సత్యనారాయణ, నాగేశ్, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేటజోన్: భాష పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్‌లుగా త్వరలో వెలువడే పదోన్నతుల షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ శనివారం సిద్దిపేట జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మకు భాషా పండితులు వినతిపత్రం సమర్పించారు. పదోన్నతులు జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చినట్లు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, శశికుమార్, చంద్రకాంత్‌గౌడ్, రాజేశం, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కూడవెల్లి జన జాతర

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు
- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



వాగులో స్నానమాచరిస్తున్న భక్తులు

దుబ్బాకరూరల్: మాఘ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాఘ అమావాస్య రోజు కూడవెల్లి వాగులో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వాగులో స్నానమాచరించారు. ఉమ్మడి మెదక్ జిల్లాల ప్రజలే కాకుండా నిజామాబాద్, కామారెడ్డి, రాజన్నసిరిసిల్లా, కరీంనగర్ నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలో ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, రాధారుక్మిణీ, వేణుగోపాలస్వామి, మహాగణపతి, వీరభద్రస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, బొబ్బిలి వీరన్న, హనుమాన్ ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. వాగు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. దైవ దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. దుబ్బాక సీఐ కృష్ణ, ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యార్థం దుబ్బాక ఆర్టీసీ బస్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు వేశారు. భూంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. జాతలో బ్రేక్‌డ్యాన్స్‌లు, రంగుల రాట్నంలో తిరుగుతూ ప్రజలు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఉత్సవాలు ఐదురోజుల పాటు కొనసాగుతాయి.



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు



జాతరలో కిక్కిరిసిన భక్తజనం

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు సతీమణి మంజులదేవి దంపతులు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకొచ్చి కూడవెల్లి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.

ఆలయాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే

రామలింగేశ్వరాలయంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. రామలింగేశ్వరస్వామి దయతో పార్టీ ముందుకెళ్లాలని కోరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

అల్వాలలో కోదండరాముడి ఉత్సవాలు



జాతరలో జన సమూహం



బండ్ల బోనాలను ఊరేగిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మాఘ అమావాస్య సందర్భంగా మండల పరిధిలోని అల్వాల కూడవెల్లి ఒడ్డున వెలసిన కోదండరాముడి సన్నిధిలో శనివారం జాతర ఘనంగా సాగింది. కూడవెల్లి వాగులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి కోదండ రాముడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి రావడంతో భక్తులతో జాతర కిక్కిరిసిపోయింది. కొనుగోళ్లతో వివిధ దుకాణాలు కిటకిటలాడాయి. అల్వాల భక్తులు బండ్ల బోనాల జాతర నిర్వహించారు. కాగా కోదండ రాముడిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోదండ రాముడిని దర్శించుకున్నారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి బండ్ల బోనాలను ఊరేగించారు.

హుస్నాబాద్ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రజని



హుస్నాబాద్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎం. రఘునందన్ రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎడబోయిన రజని, వైస్ చైర్‌పర్సన్‌గా రామోజు రజిత, డైరెక్టర్లుగా పెసరు శ్రీనివాస్, కొత్త కైలాసం, బొంకూరి వీరయ్య, చెన్నబోయిన దేవేందర్, అలుమల్ల ప్రభాకర్‌రెడ్డి, గాదగోని కొమురయ్య, మాలోతు సీతారాం, బత్తుల శ్రీకాంత్, పంజ సంపత్, చొప్పరి శ్రీనివాస్, జిల్లా రవీందర్, కొత్త శ్రీనివాస్, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ హుస్నాబాద్, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను డైరెక్టర్లుగా నియమించారు. ఈ కొత్త పాలకవర్గం 2 సంవత్సరాల వరకు కొనసాగనుంది.

ధర్నాను జయప్రదం చేయండి

నంగునూరు(సిద్దిపేట): భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు తరలిరావాలని యూనియన్ జిల్లా కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం నంగునూరులో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. సీఐటీయూ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఈనెల 28న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రమోద్, నగేశ్‌చారి, రజినీకర్‌రెడ్డి, రాజమౌళి, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపటట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చొప్పరి రవికుమార్ కార్మికులను కోరారు. శనివారం మద్దూరు, దూల్మిట్ట మండల కేంద్రంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజు, చందర్, బాలయ్య, కనకస్వామి, ప్రభాకర్, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రిట్రోఫిటింగ్ మరుగుదొడ్డి పరిశీలన



మరుగుదొడ్డిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తున్న డీపీఓ దేవకీదేవి, తదితరులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లిలో మోడల్‌గా నిర్మించిన రెండు గుంతలతో రిట్రోఫిటింగ్ మరుగుదొడ్డి నిర్మాణాన్ని, సోఫిట్స్‌ను శనివారం జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి జిల్లా ఎంపీఓలతో కలిసి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదివరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ ఇంట్లో ఒకే గుంతతో వ్యక్తిగత మరుగుదొడ్డి కట్టుకొని వాడుకొంటున్నారు. దీంతో విసర్జించిన మలం ఒకే గుంతలోకి వెళ్లడంతో తొందరగా నిండడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇటీవల దమ్మక్కపల్లిని సెంట్రల్ టీం పరిశీలనకు వచ్చినప్పుడు రెండు గుంతలతో రిట్రోఫిటింగ్ చేయించుకోవడంతో ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో అధికారులకు, ప్రజలకు వివరించారు. ఈ క్రమంలో సెంట్రల్ టీం సూచనల మేరకు గ్రామ సర్పంచ్ నీల మల్లేశం, పంచాయతీ కార్యదర్శి యాదగిరిలు మొదటగా ఒక చోట మోడల్ రెండు గుంతలతో రిట్రోఫిటింగ్ మరుగుదొడ్డిని నిర్మించారు. దీన్ని శనివారం డీపీఓ దేవకీదేవి జిల్లాలోని ఎంపీఓలు, మండల పంచాయతీ కార్యదర్శులను తీసుకెళ్లి పరిశీలించారు. వీరి వెంబడి డీఎల్‌పీఓ వేదవతి, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంఈఓ వీరరాజులు సైతం పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా నిర్మాణాలు జరిగేలా ఎంపీఓలతో వెళ్లి పరిశీలిస్తూ అవగాహన కల్పించామన్నారు. మోడల్‌గా నిర్మించిన రిట్రోఫిటింగ్ మరుగుదొడ్డిని, సోఫిట్స్‌ను చూసి వారు సంతృప్తిని వ్యక్తం చేశారు.

పందుల బెడద నుంచి కాపాడాలి



పొలం మధ్యలో తిరుగుతున్న పందులు

చేర్యాల(సిద్దిపేట): పందుల బారి నుంచి పంటలను రక్షించాలంటూ మండల పరిధిలోని ఆకునూరు గ్రామ రైతులు పలువురు కోరుతున్నారు. శనివారం పలువురు రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని వరి తదితర పంట చేనుల్లో పందులు స్వైర విహారం చేస్తూ నాటు వేసిన వరి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేస్తున్నాయన్నారు. పంటలను నాశనం చేస్తూ తీవ్రనష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పందుల బెడద నుంచి కాపాడాలని రైతులు నర్సయ్య,లింగం, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, ఆంజనేయులు వేడుకుంటున్నారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ పాలకమండలి



మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న జహంగీర్

ములుగు(గజ్వేల్): నూతన పాలకమండలి నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ ములుగు మండలం వంటిమామిడి కూరగాయల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శనివారం మంత్రి హరీశ్‌రావును కలిశారు. పాలక మండలి చైర్మన్ మహ్మద్ జహంగీర్, వైస్ చైర్మన్ కోడూరి భూపాల్‌రెడ్డి, సభ్యులు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గం ప్రమాణోత్సవానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు రాందాస్‌గౌడ్, కృష్ణమూర్తి, బాలయ్య, బాపురెడ్డి, తిరుపతినాయక్, మహాలక్ష్మి, కుమార్‌యాదవ్, ప్రవీణ్‌చారి, బాలమణి, సురేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువజన రాష్ట్ర కార్యదర్శి జుబేర్‌పాష తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గండిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పంచ రాయితండాలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీపీ మాలోతు లక్ష్మి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ గిరిజన తండాల్లో సీసీ రోడ్లు నిర్మించి ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుసాగుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రమీల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, మల్‌చెర్వుతండా సర్పంచ్ భానోతు మల్లేశ్, మాజీ జెడ్పీటీసీ భీలునాయక్, నాయకులు భానోతు సోమునాయక్, వెంకటేశ్‌నాయక్, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఎంపీతో సుందరయ్యనగర్ కాలనీవాసులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని రోళ్లబండ సుందరయ్యనగర్ కాలనీవాసులు పలువురు శనివారం భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ తన నిధుల నుంచి రూ.2లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎంపీ తెలిపినట్లు పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాయకులు మల్లయ్య, కిష్టయ్య, శ్రీనివాస్, నవీన్, కనకయ్య, శ్రీనివాస్, యాదగిరి, రాజు, ఐలయ్య, రాములు ఉన్నారు.



దత్తాత్రేయుడికి పూజలు చేస్తున్న భక్తులు



జాతరకు తరలివచ్చిన భక్తులు

భక్తులతో దత్తక్షేత్రం కిటకిట

నంగునూరు(సిద్దిపేట): మాఘ అమావాస్య పురస్కరించుకొని పాలమాకులలో కొలువైన దత్తాత్రేయ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్తలు, చీకోటి వంశస్తులు ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించి జాతరను ప్రారంభించారు. ఆలయం ఏడాదికి ఒకే రోజు తెరచి ఉంచడంతో చుట్టూ పక్కన ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పవిత్ర గుండంలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు ఆలయ సమీపంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. యువకులు రాజగోపాల్‌పేట సరిహద్దులో ఉన్న గుబ్బడిగుట్ట ఎక్కి ప్రకృతి అందాలను తిలకిస్తూ పులకరించిపోయారు. అలాగే నంగునూరు, సిద్దన్నపేట, బద్దిపడగతో పాటు వాగవతలి గ్రామాల ప్రజలు సింగరాయ జాతరకు వెళ్లి మొక్కులు తీర్చుకొని అక్కడే వనభోజనాలు చేశారు.

బండపై భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో నిలబడ్డ భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సిద్దిపేటరూరల్: స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి పుల్లూరు బండ జాతరలో భాగంగా మాఘ అమావాస్య రోజు భక్తులు గుండంలో శనివారం పవిత్ర స్నానాలు చేశారు. పవిత్ర స్నానాలు అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బండ జాతర మరో రెండు రోజుల్లో పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఆలయ నిర్వాహకులు, గ్రామ పాలకవర్గం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిద్దిపేట రూరల్ ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. సిద్దిపేట జిల్లా జడ్జి రఘురాం స్వామివారిని దర్శించుకొని స్వామికి వెండి చడి(దండ) అందజేశారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో శనివారం మాఘ అమావాస్య సందర్భంగా నిర్వహించిన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా హవనం, హోమంతో పాటు భక్తులు ఓడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మాఘ అమావాస్య సందర్భంగా శనివారం మండల పరిధిలోని సలెంద్రి రామలింగేశ్వర ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అలాగే ఇబ్రహీంనగర్‌లోని శివాయం, చిన్నకోడూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగమానసాదేవికి పూజలు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని నాగమానసాదేవి ఆలయ దశమ వార్షికోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. పురోహితులు ఆదిరాల సాయినాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. చుట్టూ పక్క గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: పట్టణంలోని 2వ వార్డులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న మురికి కాల్వ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అన్ని వార్డుల్లో సమానంగా సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త కాలనీల్లో ఇంకా అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు బోజు రమ, గోవిందు రవి, దొడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో-ఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, అయూబ్, ఏఈ సాయి ప్రణీత్ ఉన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



గజ్వేల్‌రూరల్: బహుమతులను అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు శనివారం బహుమతుల పంపిణీ చేపట్టారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా రామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తాలుకా స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 378 మంది మహిళలు పాల్గొనగా ఇందులో గెలుపొందిన పలువురికి పట్టణంలోని సత్యసాయి మందిరంలో బహుమతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిలు మాట్లాడుతూ.. సంస్కృతీ, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటిచెబుతూ ధార్మిక కార్యక్రమాలను చేపడుతున్న రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో నాచారం దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, నాచారం గుట్ట దేవస్థాన కమిటీ డైరెక్టర్ సత్యనారాయణ, సామాజిక సమరసతా వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్, నాయకులు గంగిశెట్టి రవి, రాములు, శ్రీహరి, శంకరయ్య, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిని డ్రైవర్లు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపోలో ఉత్తమ విధులు నిర్వహించిన డ్రైవర్లు, కండక్టర్లతో పాటు సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో మాదం రాజయ్య అనే రైతు పొలాన్ని సహాయ వ్యవసాయ సంచాలకురాలు శనివారం వై.పద్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వారం రోజులుగా నియోజకవర్గంలోని ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, పుల్లూరు, చిన్నగుండవెల్లి, బద్దిపడగ, గోనెపల్లి గ్రామాల్లో మొగిపురుగు, గుడ్ల సముదాయాలు గమనించామన్నారు. ఈ క్రమంలో రైతులందరూ నివారణ చర్యలు చేపట్టినట్లయితే కొంతవరకు ఉధృతి తగ్గించొచ్చని, అదేవిధంగా రైతులందరూ పంట మార్పిడి చేయాలని సూచించారు. ఇప్పటికే లార్వాదశలో వరి పంటను నష్టపరుస్తున్నాయని దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2గ్రా/ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిదంగా పిలక దశలో ఉన్న వరిలో ఎకరాకు కార్బోఫ్యురాన్ 3జి గుళికలు 10 కిలోలు/ కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు/ క్లోరంతానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పరుశురాంరెడ్డి, గ్రామ రైతుబంధు అధ్యక్షుడు రవి, వ్యవసాయ విస్తరణ అధికారి స్పందన, రైతులు పాల్గొన్నారు.